# బైపాస్ నిర్మించాలి

- ఎన్‌హెచ్ వద్దంటూ కొత్తపల్లి బంద్
- ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలని విన్నపం

**కొత్తపల్లి(కరీంనగర్):** జగిత్యాల–కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిని కొత్తపల్లి గ్రామం నుంచి కాకుండా బైపాస్ నిర్మించాలని కోరుతూ బుధవారం చేపట్టిన 'కొత్తపల్లి బంద్' విజయవంతమైంది. మిగతా ప్రాంతాల్లో బైపాస్ రహదారి నిర్మిస్తున్నట్లే తమ గ్రామం వద్ద కూడా బైపాస్ చేపట్టాలని డిమాండ్ చేశారు. జగిత్యాల–వరంగల్ జాతీయరహదారి నంబర్ 242ను దాదాపు 563 కిలోమీటర్ల నిర్మిస్తున్నారు. ఈ రహదారి విస్తరణలో భాగంగా పలు గ్రామాల్లో శివారు నుంచి బైపాస్‌లు నిర్మిస్తుండగా కొత్తపల్లిలో మాత్రం ప్రస్తుతం ఉన్న రోడ్డుకు ఇరువైపులా భూసేకరణ చేపట్టి 200 మీటర్ల విస్తీర్ణంలో జాతీయ రహదారిని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. దీనిపై ఇటీవల కొత్తపల్లి శివారులోని రామాలయం వద్ద సర్వే చేపట్టారు. దీంతో గ్రామస్తులు ఒక్కటయ్యారు. తమ విలువైన భూములతోపాటు ఇండ్లు, ఆలయాలు, మసీదులు, చర్చీలు రోడ్డు విస్తరణలో కోల్పోతున్నామని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారు గుండా బైపాస్ నిర్మించాలని కోరుతున్నారు. ఈమేరకు గ్రామ పంచాయతీలో తీర్మానించారు. బుధవారం చలో వరంగల్ చేపట్టినప్పటికీ జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అందుబాటులో లేకపోవడంతో విరమించుకున్నారు. స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ చేసి సుమారు 250 కుటుంబాల యజమానులు నిరసనలో పాల్గొన్నారు.


కొత్తపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

### ఉపాధికి ఎసరు



జాతీయ రహదారి విస్తరణతో ఇండ్లు, దుకాణాలు కోల్పోయి రోడ్డుమీద పడే పరిస్థితి వస్తుంది. వేలాది మందికి గార్మెంట్ వ్యాపారం ఉపాధి కల్పిస్తోంది. ఒకవేళ గ్రామం గుండా రహదారి నిర్మిస్తే ఆగమైతం.

– నడిమెట్ల వేణు

### 250 కుటుంబాలకు నష్టం



జగిత్యాల–కరీంనగర–వరంగల్ జాతీయ రహదారి విస్తరణలో కొత్తపల్లిలోని 250 కుటుంబాలకు నష్టం వాటిల్లనుంది. ఇండ్లు పూర్తిగా పోతున్నాయి. కుటుంబాలను రోడ్డున పడేలా చేయొద్దు.

– గుర్రం సత్యనారాయణ

### ప్రత్యామ్నాయం ఆలోచించాలి



జాతీయ రహదారి విస్తరణకు ప్రత్యామ్నాయం ఆలోచించాలి. కోట్లాది రూపాయల భూములు, ఇండ్లు, ఆలయాలు దెబ్బతింటాయి. ప్రజల కోరిక మేరకు ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలి.

– స్వర్గం నర్సయ్య

### బైపాస్ నిర్మించాలి



జాతీయ రహదారి మంచిదే అయినప్పటికీ కొత్తపల్లిలోని ప్రధాన వ్యాపారం కేంద్రం కుప్పకూలనుంది. రాణిపురం ఎక్స్‌రోడ్ నుంచి గాని, వెలిచాల ఎక్స్‌రోడ్ నుంచి వెదిరను కలుపుతూ రహదారిని విస్తరించాలి. ఫ్లై ఓవర్ కాకుండా బైపాస్ నిర్మించాలి. ఎన్‌హెచ్ ప్రాజెక్టు అధికారి నిర్ణయంపై ఆలోచిస్తాం.

– ఎండీ జమీలొద్దీన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు

## వాగ్దానాలే తప్ప ఒరిగిందేమీ లేదు

- ఒంటెల రత్నాకర్


మాట్లాడుతున్న రత్నాకర్

**కరీంనగర్:** టీఆర్ఎస్ ప్రభుత్వంతో వాగ్దానాలే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని డీసీసీ అధికార ప్రతినిధి ఒంటెల రత్నాకర్ విమర్శించారు. బుధవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. మిషన్‌కాకతీయలో అవినీతి జరిగిందని కాగ్ నివేదికకు సీఎం ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధికి ఇచ్చిన హామీలు మూడున్నరేళ్లుగా అమలు చేయడం లేదన్నారు. స్మార్ట్‌సిటీ పనులు గందరగోళంగా సాగుతున్నాయని, మానేరు రివర్‌ఫ్రంట్ అంటూ రెండున్నరేళ్లుగా ఊదరగొట్టడమే మిగులుతుందని ఎద్దేవా చేశారు. బృందావన్ గార్డెన్, మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెన అంటూ మభ్యపెట్టడం తప్ప జిల్లాకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. మాదాసు శ్రీనివాస్, వేదం, ఖాద్రీ, జనగామ శరత్‌రావు పాల్గొన్నారు.

## ఉద్యోగ సాధన నైపుణ్యాలపై శిక్షణ

**అల్గునూర్(మానకొండూర్):** మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగాలు ఎలా సాధించాలనే నైపుణ్యాలపై తిమ్మాపూర్ మండలం జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం శిక్షణ ఇచ్చారు. అంతర్జాతీయ నైపుణ్య శిక్షకురాలు రేవతి తురగ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. యాక్టివిటీస్‌ను విద్యార్థులతో చేయించారు. ఆత్మవిశ్వాసం, నిజాయితీతో ఇంటర్వ్యూల్లో విజయం సాధించవచ్చన్నారు. కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, కళాశాల ట్రెనింగ్, ప్లేస్‌మెంట్ అధికారి విశ్వప్రకాశ్‌బాబు, మ్యాక్స్ ఇనిస్టిట్యూట్ మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేవతితురగ

## ప్రజ్ఞతోనే అసలైన ప్రగతి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

**అల్గునూర్(మానకొండూర్):** విద్యార్థిదశలో నేర్చుకున్న విజ్ఞానం ద్వారానే అత్యున్నత శిఖరాలకు చేరుతూ ప్రగతిబాటన నడుస్తారని శ్రీచైతన్య కాలేజీ డైరెక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. కాలేజీలో బుధవారం జరిగిన ప్రజ్ఞ–2017 కార్యక్రమానికి హాజరై ప్రారంభోత్సవం చేశారు. పోటీల్లో పాల్గొని మేధో సంపత్తిని పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ నీలిమ, అధ్యాపకులు రాంనరేశ్, యశోద, జయపాల్ పాల్గొన్నారు.

## యూనివర్సిటీ రెజ్లింగ్ కోచ్‌గా కరీం


కరీం

**కరీంనగర్‌స్పోర్ట్స్:** అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే శాతవాహన విశ్వవిద్యాలయం రెజ్లింగ్ జట్టు కోచ్‌గా మహ్మద్ కరీం వ్యవహరించనున్నట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి వి.రమేశ్, నిర్వహణ కార్యదర్శి ఎస్.నాగేశ్వర్‌రావు తెలిపారు. హర్యానాలోని రోహతక్‌లో ఈనెల 3 నుంచి ఈ పోటీలు జరుగనున్నాయి. కరీంను జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ బాధ్యులు తుమ్మల రమేశ్‌రెడ్డి, జాడి శ్రావణ్, కంది సమ్మిరెడ్డి, వాంకుడోత్ రమేశ్, గౌరిశెట్టి రాజన్న, వివిధ క్రీడాసంఘాల కార్యదర్శులు జి.జనార్దన్‌రెడ్డి, సిద్దారెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి జి.అశోక్ అభినందించారు.

## క్వారీ ఏర్పాటును పరిశీలించిన కలెక్టర్

**గంగాధర(చొప్పదండి):** మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నర్సింహులపల్లిలో క్వారీ ఏర్పాటును కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ బుధవారం పరిశీలించారు. గ్రామంలోని సర్వేనంబర్ 37లో గ్రానైట్ క్వారీ ఏర్పాటుకు వ్యాపారులు దరఖాస్తు చేసుకోగా సంబంధిత ప్రాంతాన్ని కలెక్టర్, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. తహసీల్దార్ సరిత, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్

## ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపిక

**కరీంనగర్‌స్పోర్ట్స్:** కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోకాన్ కరీంనగర్ విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్ర, జాతీయ కరాటే పోటీలకు ఎంపికైనట్లు కరాటే అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, కోచ్ గౌరు రాజిరెడ్డి తెలిపారు. జగిత్యాలలో జరిగిన ఎస్జీఎఫ్ అండర్ 19 జోనల్‌స్థాయి కరాటే పోటీల్లో స్వర్ణం సాధించిన డి.మాలతి, ఎం.సాయికుమార్ ఈనెల 6 నుంచి నిర్మల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇటీవల సంగారెడ్డిలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్ 14 రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన ఎం.సంజన, డిసెంబర్‌లో అక్కడే నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. వీరిని కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చలిమెడ లక్ష్మీనర్సింహరావు, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సయ్య, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా బాధ్యుడు జి.జనార్దన్‌రెడ్డి తదితరులు అభినందించారు.


గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థులు

## టీఎస్ సెట్‌లో వివేకానంద అధ్యాపకుడి అర్హత

**శాతవాహనయూనివర్సిటీ:** వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలోని కామర్స్ విభాగంలో పనిచేస్తున్న కె.గోపికృష్ణ ఉస్మానియా యూనివర్సిటీ ఇటీవల ప్రకటించిన టీఎస్ సెట్ ఫలితాల్లో అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. గోపికృష్ణను కళాశాల కరస్పాండెంట్ ఆగమరావు, ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్, ఏవో బండి శ్రావణ్‌కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ బండి సంపత్‌కుమార్, రామేశ్వర్‌రావు, ఎండీ అలీఖాన్, ఆర్.కిరణ్‌కుమార్ అభినందించారు.


కె.గోపికృష్ణ

## 'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు అవార్డు


ఇండియన్ ప్రెస్‌ఫొటో అవార్డు అందుకుంటున్న సాక్షి ఫొటోగ్రాఫర్ గుంటపల్లి స్వామి

**సప్తగిరికాలనీ(కరీంనగర్):** సాక్షి కరీంనగర్ ఫొటోగ్రాఫర్ గుంటపల్లి స్వామి ఇండియన్ ప్రెస్‌ఫొటో అవార్డు అందుకున్నారు. విజయవాడలోని మధుమాలక్ష్మిహాల్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతి సమితి సౌజన్యంతో స్టేట్‌ఫొటో జర్నలిస్ట్ సంఘం ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 2017–ఇండియా ప్రెస్‌ఫొటో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. స్పాట్ న్యూస్ ఫొటోల కవరేజీలో ఇండియన్ ప్రెస్‌ఫొటో అవార్డు స్వామికి దక్కింది.